# 'వ్యాసఘట్టం'

## కాకిముక్కుకు దొండపండు

క్రిష్టశాస్త్రి లక్ష్మీపురం అగ్రహారంలోని పెద్దగృహస్థు. అతనికి సాలుకు అయిదువేలు రూపాయీలు భూములవల్ల రాబడి. సిరితో పాటు సంపదకుకూడా అతనికి లోపంలేదు. నలుగురు కుమాళ్ళ వెనుక కడసారంకూతురు. రత్నంకుయిప్పుడు పద్ధాలుగోయేడు వెళ్ళి పదిహేనోయేడు. శిష్టాచారంచేత రత్నంకు యెనిమిదోయేటనే పెళ్ళిచేశారు. అత్తవారు శ్రీరాంపురం వెంకటచయనులుగారి కోడలు. వారికి సాలుకు పదివేలు వస్తాయి భూములవల్ల; నరసింహం వక్కడేకుమారుడు. చయనులుగారు నరసింహాన్ను అయిదువేలకు వరవిక్రయంచేశారు. శాస్త్రిగారు అయిదువేలు యిచ్చి రత్నంను నరసింహంకు వివాహం చేశారు. నరసింహంకు యిరవయియేళ్లు వెళ్లేయి; చదువు మూడోక్లాసులోనే పూర్తి అయిపోయింది. రత్నం నాలుగోక్లాసు ప్యాసయింది. యిప్పుడు తండ్రిగారివద్ద సంస్కృతం చదువుకుంటూంది. రఘువంశం పూర్తికావచ్చింది. శాస్త్రిగారి కుమాళ్లు నలుగురూ పండితులే. వీరి నెవ్వరినీ శాస్త్రిగారు అమ్మలేదు. మనకున్నది చాలదాఅని అతని వుద్దేశం. యిందుగురించి శాంతమ్మ పట్టుపట్టలేదు. అందువల్ల శాస్త్రిగారు ధన్యులయారు. రత్నం పెద్దదయి యాడాదయింది. నక్షత్రం మంచిదికాదని వకయేడు విడిచి పెట్టేరు. మొన్న ఆస్వీజంలో శాంతిసారెలు శాస్త్రిగారి యింటివద్దనే జరిగాయి. ఈ సంక్రాంతిపండుక్కి నరసింహాన్ను శాస్త్రిగారు తీసుకువచ్చారు. భోగీనాడు రాత్రిభోజనాలయాయి. అంతా సావిట్లో కూర్చున్నారు. రత్నం రఘువంశం శ్లోకాలు చదువుతూంది శాస్త్రిగారు బోధపరుస్తున్నారు. కుమాళ్ళ సందేహాలని శాస్త్రిగారు తీరుస్తున్నారు. విద్యాగోష్ఠి జరుగుతూంది. నరసింహంకు యీ గోష్టియేమీ నచ్చలేదు. కునుకుపాట్లతో కొంతసేపు వూగి వెళ్లిపోయి పడుకున్నాడు. అల్లుడు గదిలోకి వెళ్లిపోయిన కొంతసేపటికి "కాకిముక్కుకి దొండపండు"అంది శాంతమ్మ. దొంగ నిద్దరలోవున్న అల్లుడు వినకపోలేదు. తెల్లవారుజామున యెవరికీ చెప్పకుండా యింటికి పారిపోయాడు. కారణం అంతా గ్రహించుకున్నారు. శాంతమ్మ చాలా నొచ్చుకుంది. "చెయ్యికాలిన తరువాత ఆకులుపట్టుకున్నట్టు". నోరు జారిపోయింది. అత్తగారు ఆడినమాట తల్లితో చెప్పేడు నరసింహం. వియ్యాలవారికి అమితాగ్రహం వచ్చింది. రత్నాన్ని అత్తవారు తీసుకువెళ్ళలేదు. పిలవండీ యోలాగా అని శాస్త్రిగారు రత్నాన్ని పంపలేదు. "కాకిముక్కు దొండపండువిప్పి చిలకముక్కుకి కట్టుకోం"అని అన్నుగ్రహించారు అత్తవారు. ఇది కథోకల్పనో అని వితర్కించకండా యీ ఆపదనుంచి రత్నం యేలాగు విముక్తి కాగలదో ఆ వుపాయం నాసోదరీమణులు వూహించి తమతమ వూహాలను 'గృహలక్ష్మికి' తెలుప ప్రార్థితలు

భాస్కరభట్ల వెంకటరమణమ్మ